## జెఎన్‌యు విద్యార్థుల పోరాటానికి మద్దతును, సంఘీభావాన్ని తెలియజేయండి

## ప్రభుత్వ నిరంకుశ, అణచివేత విధానాలను ఖండించండి

**హాస్టల్** ఫీజుల, మెస్ ఫీజుల భారీపెంపు, సరైన దుస్తుల పేరిట విద్యార్థులకు డ్రస్‌కోడ్ విధించటం, హాస్టళ్ళలో వుండేవారికి కర్ఫ్యూ సమయం విధించటం, హాస్టల్ గదులలో కరెంటు, నీళ్ళ మీటర్లు పెట్టటం, నెలకు రూ.1700 సర్వీసు ఛార్జి విధించటం అనేవి ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ విద్యార్థులకు ఏకపక్ష శరాఘాతాలయ్యాయి. అదనపు ఫీజులతో కలిపి పెంపుదల మొత్తం వెయ్యిశాతంగా వుంది. యూనివర్శిటీలోని పేద విద్యార్థులపై ఇది తీవ్రప్రభావం చూపుతుంది. విద్యార్థులు రాత్రి 11.30 వరకు మాత్రమే లైబ్రరీని ఉపయోగించకోగలుగుతారు. తర్వాత యూనివర్శిటీలో విద్యార్థులపై కర్ఫ్యూ అమలవుతుంది. విద్యార్థులు భావిస్తున్నట్లుగా ఈ చర్యలన్నీ విశ్వవిద్యాలయ ప్రతిష్టను దెబ్బతీసేవిగా, విద్యను సరుకుగా మార్చి కేవలం సమాజంలోని కొన్ని వర్గాలకు, కులాలకు మాత్రమే పరిమితంచేసే విధంగా వున్నాయి.

వీటికి వ్యతిరేకంగా జెఎన్‌యు విద్యార్థి సంఘం నాయకత్వాన విద్యార్థులు నిరసన తెలియజేయటం ప్రారంభించారు. యూనివర్శిటీ స్నాతకోత్సవానికి వచ్చిన కేంద్ర మానవ వనరులశాఖ మంత్రికి, ఉపాధ్యక్షులకు తమ సమస్యలు విన్నవిద్దామని 3000 మందికి పైగా వెళ్ళిన విద్యార్థులకు బారికేడ్లు అడ్డంగా పెట్టారు. బారికేడ్లు దాటటానికి ప్రయత్నించిన విద్యార్థులను సిఆర్‌పిఎఫ్ బలగాలు, పోలీసు బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. విద్యార్థులను చెల్లాచెదురు చేయటానికి వారు లాఠీలు, వాటర్‌కానన్లు ఉపయోగించారు. విద్యార్థినులపట్ల అసభ్యకరంగా ప్రవర్తించటమేకాకుండా వారిని భౌతికంగా గాయపరిచారు. అనేకమందికి గాయాలయ్యాయి. అర్థరాత్రి వరకు అధికసంఖ్యలో పోలీసులు, పారా మిలటరీ బలగాలు క్యాంపస్ బయట మోహరించాయి.

2019 నవంబరు 13న జెఎన్‌యు పాలకవిభాగం పెంచిన ఫీజులో పాక్షిక తగ్గింపును ప్రకటించింది. కానీ ఇది విద్యార్థులను చీల్చటానికి, వంచించటానికి తీసుకున్న చర్య మాత్రమే. విద్యార్థులు మొత్తం పెంపుదలను ఉపసంహరించుకోవాలని డిమాండు చేస్తున్నారు. నవంబరు 17న విద్యార్థులు పార్లమెంటుకు లాంగ్‌మార్చ్ తలపెట్టగా వారికి పోలీసుల తీవ్ర అణచివేత ఎదురైంది. రోడ్లపై బారికేడ్లు పెట్టారు. విద్యార్థులపై విచక్షణారహితంగా లాఠీఛార్జి చేశారు. 150 మందికి పైగా నిరసనకారులను అరెస్టు చేశారు. అయినప్పటికీ విద్యార్థులు అసామాన్యమైన పట్టుదలతో, ఐక్యతతో తమ నిరసనను కొనసాగించారు.

బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటినుండి యూనివర్శిటీలోని మతతత్వ, కులతత్వ జాతీయ దురహంకారశక్తులకు కొమ్ముకాయటమే కాకుండా ప్రగతిశీల, ప్రజాస్వామ్య, దళిత, మైనారిటీ విద్యార్థులపై దాడులు సాగించింది. జాతీయ భద్రత కిందో, దేశద్రోహ నేరంకిందో కొంతమంది విద్యార్థులపై తప్పుడు కేసులు బనాయించింది. కానీ ఈ ప్రవాహాలకు చెందిన నాయకత్వం, కార్యకర్తలు వెరవకుండా, దృఢంగా, ఐక్యతతో నిలబడ్డారు. వారు విద్యార్థుల మనసులను గెలుచుకున్నారు. జెఎన్‌యులో జరిగిన యూనియన్ ఎన్నికల్లో ఎబివిపిని ఓడించి జెఎన్‌యు స్టూడెంట్ యూనియన్ నాయకత్వాన్ని కైవసం చేసుకున్నారు.

జెఎన్‌యు విద్యార్థుల పోరాటం ప్రజాస్వామికమైనది, న్యాయమైనది. విద్యను వ్యాపారంగా మార్చే పాలకుల దుర్నీతిని, విశాల ప్రజా రాశులకు విద్యను దూరంచేసే విధానాలను ఎండగడుతూ ప్రజలకుగల చదువుకొనే హక్కును అది ఎత్తిపట్టింది. దేశంలోని వివిధ ప్రాంతాలలోని విద్యార్థులు జెఎన్‌యు విద్యార్థుల డిమాండ్లకు, పోరాటానికి సంఘీభావాన్ని, మద్దతును తెలపటాన్ని మేం స్వాగతిస్తున్నాం. విద్యార్థుల న్యాయమైన పోరాటాన్ని క్రూరంగా అణచివేయటానికి పూనుకున్న జెఎన్‌యు, కేంద్రప్రభుత్వ విధానాలను ఖండిస్తున్నాం. ఈ నిరసన మరింత బలాన్ని పుంజుకుంటుందని, అన్నిరకాల కష్టాలను అధిగమిస్తుందని, మరిన్ని విజయాలు సాధిస్తుందని మేం విశ్వసిస్తున్నాం.

**20-11-19**

**విశ్వం**
ప్రధానకార్యదర్శి
సిపిఐ(ఎం.ఎల్)

ooo